# జహీరాబాద్‌లో 76.72శాతం నమోదు




స్ట్రాంగ్‌రూం వద్ద ఎన్నికల పరిశీలకుడు పవన్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, డీఎస్పీ రఘు

- **2018 ఎన్నికల్లో 80.91శాతం పోలింగ్ నమోదు**
- **గత ఎన్నికల కంటే తగ్గిన పోలింగ్ శాతం**

జహీరాబాద్, డిసెంబర్ 1 : జహీరాబాద్ నియోజకవర్గంలో 76.72శాతం పోలింగ్ నమోదు అయింది. నియోజకవర్గంలో 2,70,785 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల్లో 2,07,748 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,06,445మంది, మహిళలు 1,01,302 మంది, ఇతరులు ఒకరు ఓటు వేశారు. జహీరాబాద్ మున్సిపల్‌లోని అల్లీపూర్‌లో పురుషులు 560, మహిళలు 516 మొత్తం 1076 ఉండగా ఎన్నికల్లో పురుషులు 273, మహిళలు 265 మొత్తం 538మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అల్లీపూర్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 216లో 50 శాతం నమోదు అయింది. న్యాల్‌కల్ మండలంలోని మిరియంపూర్‌లో పురుషులు 252, మహిళలు 225 మొత్తం 477ఉండగా ఎన్నికల్లో పురుషులు 236, మహిళలు 207 మొత్తం 443మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎన్నికల్లో గ్రామంలో 92.87 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో అత్యధికంగా న్యాల్‌కల్ మండలంలోని మిరియంపూర్‌లో 92.87శాతం నమోదు కాగా, జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ గ్రామంలోని బూత్ నంబర్ 216లో అతితక్కువగా 50శాతం నమోదైంది. 2018 ఎన్నికల్లో 80.91శాతం నియోజకవర్గంలో పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో గతం కంటే పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది.

**స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు తరలింపు**

జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని గీతం యూనివర్సిటీకి తరలించారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని ప్రత్యేక భద్రత మధ్య ఆర్టీసీ బస్సులో తరలించారు. ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూం వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పవన్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, డీఎస్పీ రఘు పర్యవేక్షణలో ఈవీఎంలు భద్రత పరించారు.

## కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్ష

జహీరాబాద్, డిసెంబర్ 1: జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు అసెంబ్లీ ఎన్నికలపై బీఆర్ఎస్ నాయకులతో గ్రామాల వారీగా పోలింగ్ సరళిపై సమీక్ష చేశారు. శుక్రవారం నియోజకవర్గంలోని జహీరాబాద్ పట్టణంతో పాటు జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలంలో జరిగిన పోలింగ్ సరళిపై సమీక్ష చేశారు. పోలింగ్‌లో ఏ గ్రామంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ వస్తుందో తెలుసుకున్నారు. బీఆర్ఎస్ విజయం ఖాయమని ఎమ్మెల్యే అన్నారు.



పట్టణంలోని స్వగృహంలో వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## గజేంద్ర ఆశ్రమంలో రుక్మిణీ కల్యాణం

సిర్గాపూర్, డిసెంబర్ 1: మండలంలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో పాండురంగస్వామి రుక్మిణీమాత కల్యాణం మహోత్సం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ఆశ్రమ పీఠాధిపతి కరణ్ భారతీ మహారాజ్ నేతృత్వంలో గ్రామస్తులు గ్రామ ఆచార సంప్రదాయ పద్ధతిన కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది సంఖ్యలో భక్తులు హాజరు కావడంతో ఆలయ ప్రాంగణం, ఆశ్రమ మండపం భక్తులతో నిండిపోయి కిక్కిరిసింది. అనంతరం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## చెత్త తొలిగించిన విద్యార్థులు

సంగారెడ్డి, డిసెంబరు 1: విద్యార్థులు పరిశుభ్రంగా ఉంటేనే విద్యపై దృష్టి సారిస్తారని, అందుకోసం పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించామని మండల విద్యాధికారి దండు అంజయ్య అన్నారు. శుక్రవారం సదాశివపేట మండలంలోని నందికంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించి చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ అంజయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో పరిసరాల పరిశుభ్రతను మెరుగుపర్చుకుంటారన్నారు. దీంతో పాటు రోజూ ధరించే బట్టలు, వాడుకునే వస్తువులను కూడా శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య సమస్యలు రావని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కూలిన గొడ పెచ్చులను తొలగిస్తున్న విద్యార్థులు

# నారాయణఖేడ్‌లో 83.23 శాతం

### ఇస్లాంపూర్‌లో అత్యధికం, నెహ్రూనగర్‌లో అత్యల్పం

నారాయణఖేడ్, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం పోలింగ్ నిర్వహించగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో 83.23శాతం పోలింగ్ నమోదైంది. కాగా 5గంటల వరకు 75.34శాతం పోలింగ్ నమోదు కాగా రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలో మొత్తం 2,31,188 మంది ఓటర్లుండగా 1,92,480మంది ఓటు హక్కును వినియోగించుకోగా 83.23శాతం పోలింగ్ నమోదైంది. అయితే మొత్తం 1,16,581 మంది పురుషులకు గానూ 98,139, మొత్తం 1,14,599మంది మహిళలకు గానూ 93,037 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక పోలింగ్ సరళిని విశ్లేషిస్తే మనూరు మండలం ఇస్లాంపూర్ 296వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 94.03శాతం పోలింగ్ నమోదు కాగా మొత్తం 134మంది ఓటర్లకు గాను 126మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ 50వ పోలింగ్ కేంద్రంలో స్త్రీ, పురుషుల ఓట్లు సమానంగా పోలవడం గమనార్హం. ఇక్కడ మొత్తం 939ఓట్లు ఉండగా 425ఓట్ల చొప్పున స్త్రీ, పురుషుల ఓట్లు నమోదు కాగా మొత్తం 850ఓట్లు పోలవగా 90.52శాతం పోలింగ్ జరిగింది.



తుర్కపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

## చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి

న్యాల్‌కల్, డిసెంబర్ 1: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ నృపేన్ చక్రవర్తి, హద్నూర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మిర్జాపూర్(బీ), హద్నూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్జాపూర్(బీ) గ్రామంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు కలిసి ర్యాలీలను నిర్వహించారు. అనంతరం మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన సదస్సులో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రావడానికి గల కారణాలు, వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు వైద్య సిబ్బంది, అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జగదీశ్వర్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది శ్యామల, గోపికృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




మిర్జాపూర్(బి)లో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

# అందోల్‌లో 84.76 శాతం

- **జిల్లాలో అత్యధికంగా పోలింగ్ నమోదు**
- **రాత్రి వరకు పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు**

అందోల్, డిసెంబర్ 1: 30న జరిగిన ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్‌శాతం నమోదైంది. 84.76 ఓటింగ్‌శాతం నమోదు కావడంతో జిల్లాలోనే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న నియోజకవర్గాల్లో అందోల్ మొదటి స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలోని 9మండలాల్లో మొత్తం 2.49.248మంది ఓటర్లుండగా, పురుషులు 1,22,669మంది మహిళలు, 1,26,543, ఇతరులు ఆరుగురు ఉన్నారు. ఇందులో 10,5,642మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా, పురుషులు 1,05,722 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,11,364 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. గురువారం రాత్రి వరకు నిర్వహించిన పోలింగ్‌లో 84.76శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి పాండు తెలిపారు.

గురువారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా...కొన్ని కేంద్రాల్లో రాత్రి 7:30 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎన్నికల సమయం సాయంత్రం 5 గంటల వరకే ఉన్నపటికీ అప్పటి వరకు క్యూలైన్లో ఉన్న ప్రతి ఒక్కరికీ టోకెన్లు అందజేసిన అధికారులు ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయం కల్పించారు.

2018తో పోల్చి తే ఓటింగ్ పర్సేంటేజీ శాతం కొద్దిగా తగ్గింది. ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు భాగా పెరగడంతో వారంత ఉత్సాహంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకుని సెల్ఫీలు దిగారు. కాగా ఓటేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ఓటర్లతో బస్సులు, ఆటోలు, బస్టాప్‌లు కిక్కిరిశాయి.



ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు (ఫైల్)

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం,డిసెంబర్ 1: అప్పుల బాధతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయసముద్రం చెరువు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురం డివిజన్‌లోని ఓల్డ్ ఆర్సీపురానికి చెందిన శివకుమార్(28) ఫార్మ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతడు బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులు చేశాడు. ఇటీవల రూ. 10వేలు అప్పుచేసి బెట్టింగ్ కట్టాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. అప్పులు ఎక్కువ కావడంతో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లి ఇంటి దగ్గర్లో ఉన్న రాయసముద్రం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్య సరిత తెల్లావారు జామున బయటకు వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో బొంబాయికాలనీలో ఉన్న ఆమె అక్కకు ఫోన్ చేసి అడుగగా రాలేదని చెప్పారు. ఆ తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించగా చెరువు సైడ్ వెళ్లినట్లు గమనించారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే చెరువులో అతడు మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నారాయణగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు సోదరుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కంగ్టి మండలంలో 83.73 శాతం పోలింగ్

కంగ్టి, డిసెంబర్ 1 : మండలంలో 83.73శాతం పోలింగ్ నమోదైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి విష్ణుసాగర్ శుక్రవారం తెలిపారు. మండలంలో కొన్ని గ్రామాల్లో రాత్రి 9గంటల వరకు ఓటింగ్ కొనసాగిందని చెప్పారు. మండలంలో మొత్తం 43 పోలింగ్ బూత్‌లకు గానూ 34479 ఓటర్లు ఉండగా ఇందులో 28,870 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. కంగ్టి సీఐ హన్మంతు, ఎస్సై విశ్వజన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## అందోల్‌లో ఎగిరేది గులాబీ జెండానే

### మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

అందోల్, డిసెంబర్ 1: అందోల్‌లో ముచ్చటగా మూడోసారి ఎగిరేది గులాబీ జెండానేనని అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య అన్నారు. శుక్రవారం అందోల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం కోసం పని చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అందోల్–జోగిపేట పరిధిలోని అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించారన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని ప్రభుత్వంపై నమ్మకముంచిన ప్రజలకు మరింత సౌకర్యవంతమైన పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం, నాయకులు వెంకటేశం, సునీల్‌కుమార్, సత్యం, మహేశ్‌యాదవ్, శంకర్, అశోక్, రమణ, గోపాల్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.